


మండుతున్న ఎండలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మన్యంలో వేసవి ఎండలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైబడి నమోదు కావడంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు ఉక్క పోతతో అల్లాడుతున్నారు. ఎండలకు తోడు వడగాలుల ప్రభావం ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. మంగళవారం గుమ్మలక్ష్మీపురంలో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మరో మూడు రోజుల పాటు వేసవి ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

పేదల స్థలాలపై ఎమ్మెల్యే పెత్తనం

- కబ్జాదారుల జోలికెళ్లని బోనెల
- రాజీ పడ్డారనే ఆరోపణలు
- చెరువుల ఆక్రమణపై స్పందించని అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వ్యవహారశైలి అంతు చిక్కడం లేదు. ఎన్నికల ముందు టిడిపి అభ్యర్థిగా ఊరూరా తిరిగి ఊదరగొట్టిన ఉపన్యాసాలలో రవ్వంత కూడా అమలు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్వతీపురంలో జరిగిన ప్రభుత్వ చెరువులు, భూముల ఆక్రమణపై ఆయన తన ఎన్నికల ప్రచారంలో గొప్పగా మాట్లాడారు. కబ్జాదారుల అంతు చూస్తానని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఉక్కుపాదం మోపుతానని ఆయన చేసిన ప్రసంగాలు ఇప్పటికీ జనం చెవుల్లో రింగు రింగున మారుమోగుతున్నాయి. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటింది. ఇంతవరకు ఆయన పట్టణంలో ప్రభుత్వ చెరువుల కబ్జాలపై విచారణకు డిమాండ్ చేయలేదు. కోట్లాది రూపాయల విలువైన చెరువులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయనేది జగమెరిగిన సత్యం. అన్నీ తెలిసినా ఎమ్మెల్యే బోనెల నోరు మెదపకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో పట్టణంలోని ప్రధాన ప్రభుత్వ చెరువులు, భూములు ఆక్రమణకు గురయ్యాయి. ఈ ఆక్రమణల వెనుక అప్పటి స్థానిక ఎమ్మెల్యే హస్తం ఉందనే ఆరోపణలు వచ్చాయి. పట్టణంలో అనేక చెరువులు ఆక్రమణకు గురయ్యాయని కూటమి పార్టీల్లో ఒకటైన జనసేన నాయకులు కూడా గళమెత్తారు. అధికారపార్టీ ఎమ్మెల్యేగా విజయచంద్ర చెరువుల కబ్జాలపై జిల్లా రెవెన్యూ అధికారులను కలిసి విచారణ జరిపించాలని డిమాండ్ చేయొచ్చు. కానీ ఆయన అలా చేయకుండా ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో గొంతు విప్పడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రమైన తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని చెరువుల కబ్జాల పర్వం విచ్చలవిడిగా కొనసాగింది. అప్పటి కలెక్టర్ గానీ, ఇతర అధికారులు గానీ కబ్జాలపై చర్యలు తీసుకోలేదు. ఫిర్యాదులందినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఇలాంటి పరిస్థితుల్లో స్థానిక ఎమ్మెల్యే గతంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఆక్రమణల అంతు చూసి వుంటే ప్రజలు హర్షించేవారు. గత ప్రభుత్వం హయాంలో పట్టణం లో ప్రభుత్వ చెరువుల కబ్జాలకు మూల సూత్రధారి అయిన ఒక పట్టణ నాయకుడు ఎన్నికల ముందు టిడిపిలో చేరారు. ఇప్పుడు ఆ నాయకుడితో కలిసి ఎమ్మెల్యే ప్రయాణిస్తున్నారు.



నిర్వాసితుల భూమిలో చెట్లును, గోడలను తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

పేదల స్థలాలపై పెత్తనం దేనికి?

వందల కోట్ల రూపాయల విలువైన చెరువులు, భూముల ఆక్రమణపై పోరాడని ఎమ్మెల్యే బోనెల పేదలకు కేటాయించిన ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు ఉన్నాయని తన అనుచరులతో ఫిర్యాదులు చేయించడం వివాదాస్పద మవుతోంది. దాదాపు రెండు దశాబ్దాల క్రితం తోటపల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం పునరావాస ప్యాకేజీ కింద ఇంటి స్థలాలు, పరిహారం పంపిణీ చేసింది. పునరావాస నిబంధనలకు లోబడే అప్పటి జిల్లా అధికారులు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. పునరావాస ప్రక్రియలో భాగంగా ఏర్పడిన బంటువానివలసలో అందరి నిర్వాసితుల మాదిరిగానే నిర్వాసితుడైన సంఘం నాయకులు బంటు దాసుకు ఇంటి పట్టా అందజేశారు. గ్రామస్తుల కోరిక మేరకు ఆ గ్రామంలో రామాలయం నిర్మాణానికి బంటు దాసు ఇంటి పక్కన స్థలం కేటాయించారు. వాస్తు నిబంధనలకు విరుద్ధంగా వున్న స్థలంలో రామాలయం నిర్మించరాదని గ్రామపంచాయతీలో తీర్మానం చేయడంతో వేరొక చోట స్థలంలో దాసు తన సొంత ఖర్చుతో ఆలయం నిర్మించారు. తన ఇంటి పక్కన ఉన్న స్థలం చుట్టూ ఆయన గ్రామపెద్దల తీర్మానం మేరకు ప్రహరీగోడ నిర్మించుకున్నారు. దీనిలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని భావించి అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించడం, వెంటనే అధికారులు పోలీసుల సహకారంతో బంటు దాసు ప్రహరీగోడను జెసిబితో కూల్చడం వివాదానికి దారితీసింది. పట్టణంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు అనేక ఫిర్యాదులు ఇప్పటికే అందాయి. వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయని ఎమ్మెల్యే బోనెల పేదలకు దశాబ్దాల క్రితం మంజూరు చేసిన ఇంటి స్థలాలపై పెత్తనం చెలాయించాలని చూడడం వెనుక రాజకీయ కుట్ర కోణం దాగి వున్నట్లు తెలుస్తోంది. గతంలో పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లికి ఒక మహిళ భూముల వ్యవహారంలోనూ ఎమ్మెల్యే అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు అప్పట్లో వినిపించాయి.

రాజకీయ నాయకుల ప్రోద్బలంతోనే నిర్వాసితులపై దాడి

- అధికారుల చర్యలు వెనుక రాజకీయ హస్తం లేదంటారా?
- తోటపల్లి నిర్వాసితులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- కమ్యూనిస్టులను తప్పు పట్టడం సరైనది కాదు
- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

రాజకీయ ఒత్తిడి కారణంగానే రెవెన్యూ అధికారులు, పోలీసులు నిర్వాసితుల భూములపై బుల్డోజరుతో దాడి చేశారని సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళ వారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం బంటువానివలస గ్రామంపై నిర్వాసితులు నిర్మించుకున్న గోడలను, చెట్లను తహశీల్దార్, పోలీసు యంత్రాంగం పూర్తిగా కూల్చివేసిన సంగతి అందరికీ తెలిసినదేనన్నారు. దీన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన నిర్వాసితులపై 107 కేసులు కూడా నమోదు చేశారన్నారు. ఈ దాడిని ఖండిస్తూ సోమవారం భూ నిర్వాసితులంతా కలెక్టర్ ఆఫీసు వద్దకు వెళ్లి విన్నవించుకున్న విషయం తెలిసినదే. జాయింట్ కలెక్టర్ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇది ఇంతవరకు జరిగిన ఒక ప్రక్రియ అని అన్నారు. దీన్ని ఒక వ్యక్తి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ ఇది చట్టపరంగా న్యాయమైనదేనని, దీనిలో ఎమ్మెల్యే విజయచంద్ర ప్రమేయం ఏమీ లేదని అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంతకన్నా దౌర్భాగ్యమైన పరిస్థితి ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. నిర్వాసితుల భూమి కూల్చివేతపై ఎమ్మెల్యే పాత్ర ఉన్నదా లేదా అనేది ఎమ్మెల్యే ఖండించాల్సింది పోయి, ఒక సాధారణమైన వ్యక్తి ఖండించడమంటే ఆ వ్యక్తికి, అధికారులకు ఆత్మరక్షణకు మరో మార్గంలో భాగమేనని వివరించారు. అసలు అధికారులు ఆదివారం అయినప్పటికీ హుటాహుటిన నిర్వాసితుల నిర్మాణం కూల్చివేతకు అంత ఉత్సాహం వెనుక కారణం ఏమిటి, ఏ ఒక్క వ్యక్తి ఒత్తిడి లేకుండానే అధికారులు, పోలీసులు ఈ దారుణానికి పాల్పడ్డారా అని ఆయన ప్రశ్నించారు.



ఇది ఈనాటి సమస్య కాదని, అధికారులు చెప్పినట్టు చాలా ఏళ్ల సమస్యగా తేల్చితే, ఆదివారం గుర్తు రావడం ఏమిటని, ఇంతకన్నా ముందు ఎప్పుడు గుర్తుకు రాలేదా అని అన్నారు. అధికారుల నిజాయితీని తాము గౌరవిస్తున్నామని, ఇదే నిజాయితీతో గడిచిన పదేళ్లలో జిల్లాలో గల చెరువులు భూ కబ్జాలకు ఎన్ని గురైనవి, ఎన్నింటిని పరిష్కారం చేశారో బహిరంగం గా తెలపాలని అన్నారు. దేవునిబంధ, వరహాల గెడ్డ ఇలా అనేక రకాల గెడ్డలన్నీ కబ్జాలకు గురైన విషయం అధికారులకు తెలియదా, లేక రాజకీయ హస్తం ఉందన్న కారణంగా విడిచి పెట్టేశారా అని ప్రశ్నించారు. బంటువానివలసలో నిర్వాసితుల భూమి ఒక వ్యక్తి చెప్పినట్టు కబ్జాకు గురైనట్లయితే ఆనాటి తహశీల్దార్ అధికారికంగా ఏ విధంగా పట్టాను జారీ చేయగలరు, అది అబద్ధమని రుజువు చేయగలిగితే, తోటపల్లి నిర్వాసితులకు ఇచ్చిన పట్టాలన్నీ కూడా అబద్ధమేనని, మరీ దీనికి అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది ఆక్రమణ అని తహశీల్దార్, ఆర్‌డిఓ, కలెక్టర్ స్థాయి అధికారులు తేల్చి చెప్పాలే గాని ఈ భూమితో ఎటువంటి సంబంధం లేని ఒక వ్యక్తి చెప్పడం వెనుక రహస్యం లేదనే విషయం నమ్మశకం కానిదని అన్నారు. కమ్యూనిస్టులను తప్పు బడుతూ అనేక దుర్భాషలాడడం సమంజ సం కాదని, ఆ వ్యక్తికి ఒక రాజకీయ నాయకుడు హక్కు ఇచ్చారనే విషయం స్పష్టంగా అర్థమవుతుం దని తేల్చి చెప్పారు. ఒక తహసీల్దారు మండలంలో ఎవరైనా అక్రమంగా చెట్లను కూలగొడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి, అంతే తప్ప అదే తహశీల్దారు ఏ చట్ట ప్రకారంగా చెట్లను కూలగొడతారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సంఘటన సందర్భంలో తహశీల్దార్ కు ఆ భూమికి సంబంధించిన పట్టాలు చూపించి నప్పటికీ పైనుంచి వచ్చిన రాజకీయ అధికారుల ఒత్తిడి కారణంగానే అది తప్పు అని తెలిసినా, తప్పని పరిస్థితుల్లో కూల గొట్టడం తప్పలేదని, ఈ దారుణ పరిస్థితికి కారణమైన తహశీల్దార్, సంబం ధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు. అధికారులు రాజకీయ నాయకుల అక్రమ పనులకు తలొగ్గే పని చేయొద్దని, దానివల్ల నష్టపోయేది అధికారు లేనని, ఇప్పటికైన రాజకీయ నాయకుల కుట్రలను బట్టబయలు చేయాలని, రాజకీయ మోసపు మాటలకు బలికావద్దని విజ్ఞప్తి చేశారు. ఇది ఒక వ్యక్తి సమస్య కాదని, తోటపల్లి నిర్వాసితుల పోరాట ఫలితమని, దాన్ని అక్రమంగా అందుకునే ప్రయత్నం చేపడితే మరో తోటపల్లి పోరాటం జరగడం ఖాయమని తేల్చి చెప్పారు.

26న ట్వంటీ పాయింట్ ప్రోగ్రామ్ చైర్మన్ సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాలు, ప్రాజెక్టులపై ఈనెల 26న 20 పాయింట్ ప్రోగ్రామ్ చైర్మన్ సమీక్షించనున్నారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఈనెల 26న సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ఉపాధి హామీ, జల్ జీవన్ మిషన్, పిఎం గ్రామీణ సడక్ యోజన, వ్యవసాయం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, టిడ్కో గృహాలు, అమృత్ 1.0, 2.0, లాఖ్‌పతి దీదీస్, ఎస్.హెచ్.జీలకు డ్రోన్స్, విశ్వకర్మ, పీఎం స్వానిధి, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్ తదితర పథకాల అమల తీరును సంబంధిత అధికారులతో చైర్మన్ సమీక్షించనున్నట్లు చెప్పారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పిఎం ఫసల్ బీమా యోజన, పిఎం కృషి సంచాయ్ యోజన, ఎరువుల సబ్సిడీ, జాతీయ గోకుల్ మిషన్-పాల ఉత్పాదకత, ప్రస్తుత స్థితిగతులపై సమావేశంలో చర్చ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వీటితో పాటు జిల్లాలోని పర్యాటక అభివృద్ధి కార్యకలాపాలు, పారిశ్రామిక పార్కులు, మున్సిపాలిటీల పరిధిలోని మురికివాడల అభివృద్ధి, తాగునీటి సరఫరా తదితర అంశాలపై సమీక్ష జరగనుందని ఆయన వివరించారు. కావున సంబంధిత అధికారులంతా పూర్తి సమాచారంతో సమావేశానికి తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

సాలూరులో జాబ్ మేళా వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం

సాలూరు శ్రీ సత్య సాయి డిగ్రీ కళాశాలలో బుధవారం జరగనున్న జాబ్ మేళా అనివార్య కారణాల వ్ల వాయిదా పడినట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తదుపరి తేదీ త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వాట్సాప్ సేవలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) 9552300009కు "హాయ్" అనండి... హాయిగా సేవలు పొందండి అన్నారు. ప్రభుత్వ వాట్సాప్ నంబరు 9552300009 ను మన మిత్ర పేరుతో సేవ్ చేసుకోవాలని, ఆ నంబరుకు "హాయ్" అని సందేశం పంపడం ద్వారా చాట్ చేయడం ప్రారంభించాలని, కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలన్నారు. వెంటనే వాట్సాప్ లో ఏఐ ఆధారిత చాట్బాట్ లో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుందని, అందులో అవసరమగు సేవను ఎంపిక చేసుకోవాలని, లేదా వాయిస్ కమాండ్స్ కూడాఉపయోగించుకోవచ్చని చెప్పారు. కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాట్ ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు, లేదా సర్వీస్ రిక్వెస్టు ఐడీ వంటి మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చని తెలిపారు. ఈ వివరాలను టెక్స్ట్ రూపంలో కానీ లేదా వాయిస్ రూపంలోనైనా ఇవ్వాలని, సర్వీస్ కన్ఫర్మేషన్ పొందాలని, ఇచ్చిన వివరాలను ఒకసారి తనిఖీ చేసిన తర్వాత, అందులోని సిస్టమ్ రియల్-టైమ్ అప్డేట్స్ లేదా ఒక కన్ఫర్మేషన్ సందేశాన్ని పంపుతుందని, చెల్లింపుల కొరకు, భద్రతతో కూడిన ఒక పేమెంటు లింక్‌ను కూడా పంపుతుందని తెలిపారు. జరిగిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రశీదును డౌన్లోడు చేసుకోవాలని ఆయన సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ లోని చాట్ బాట్ ఇ - ధృవీకరణ పత్రాలు, రశీదులు, లేదా అక్నాలెడ్జిమెంట్లను రూపొందించి అందజేస్తుందన్నారు.

10 పరీక్ష ఫలితాలు పొందవచ్చు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు, ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఓపెన్ స్కూల్, ఇంటర్ ఫలితాలు ఈనెల 23న విడుదల చేయనున్నారని, వాటి ఫలితాలు వాట్సాప్‌లో 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, వారి రోల్ నంబర్ నమోదు చేయడం ద్వారా వారి ఫలితాల పిడిఎఫ్ కాపీ పొందవచ్చని చెప్పారు. అభ్యర్థులు ఫలితాలకు https://bse.ap.gov.in, https://apopenschool.ap.gov.in/ వెబ్ సైట్లు, 'మన మిత్ర' (వాట్సాప్), లీప్ (LEAP) మొబైల్ యాప్‌లో చూడవచ్చున్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్త

సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని మోసం చేయవచ్చని, జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నంబర్లకు బదులివ్వొద్దని, డిజిటల్ అరెస్టులు లాంటివి లేవని ఆయన తెలిపారు. డిజిటల్ అరెస్ట్ అని ఎవరైనా చెప్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్లు డౌన్లోడు చేసుకోవద్దని, వాటిని సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) ద్వారా ఇతరులకు షేర్ చేయొద్దని, అలా చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. బెట్టింగు యాప్‌లు ఉపయోగించినా ఇతరులకు ప్రమోట్ చేసినా చట్టరీత్యా నేరమన్నారు. ఏ అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి (www.cybercrime.gov.in) కాల్ చేయాలని ఆయన చెప్పారు.

శక్తి యాప్ ఉపయోగించుకోవాలి

మహిళలు, చిన్నారుల భద్రతకు శక్తి యాప్ ఉపయోగించుకోవాలన్నారు. స్మార్ట్ ఫోన్లోని ప్లే స్టోర్ నుంచి శక్తి యాప్‌ను డౌన్లోడు చేసుకోవచ్చని, అందులో ఒకసారి మీ మొబైల్ నంబరును రిజిస్టర్ చేసుకుని ఒటిపి పొందవచ్చని చెప్పారు. "ఎప్పుడైనా, ఎక్కడైనా సరే ఆపదల్లో ఉన్నా, ప్రమాదంలో చిక్కుకున్నా వెంటనే ఈ యాప్‌ను ఉపయోగించండి లేదా మీ మొబైల్‌ను ఒక్కసారి షేక్ చేసినా చాలని, వెంటనే మీకు దగ్గర్లోని పోలీసులు మీ వద్దకు చేరుకుని మీకు సహాయం చేస్తారని, శక్తి యాప్.. ఆపదవేళ మీ ఆత్మీయ నేస్తం" అని తెలిపారు.



విడివికె సభ్యులతో మాట్లాడుతున్న జెసి శోభిక

విడివికెల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - కొమరాడ

డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న విడివికెల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు జెసి శోభిక అన్నారు. మండలంలోని చోళపదం విడివికెలో ఏర్పాటు చేసిన జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు పండించే జీడిపిక్కలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు. బుధవారం నుంచి ఆయా కేంద్రాల్లో జీడిపిక్కలు ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. కేజీ జీడి పిక్కలు రూ.155కు ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కొమరాడ మండలంలో చోళపదం, అంకులవలస గ్రామాల్లో విడివికెల ద్వారా కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకు ప్రభుత్వ కొనుగోలు చేసే కేంద్రాల వద్దకు జీడిపిక్కలను తెచ్చి అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్రావు, ఎపిఎం సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.




ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధిహామీ వేతనదారులు

నేడు ఎస్‌టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి - పాచిపెంట

ఎపి గిరిజన కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పెద్దగెడ్డ జలాశయం, హరిత రహదారి గిరిజనుల సమస్యలపై కోడికాళ్లవలస, గరేళ్లవలస, గోగాడవలస, ఆలూరు, మడవలస గిరిజన గ్రామాల ప్రజల సర్వీస్ రహదారి గురించి కోడి కాలవలస సమీపంలో హరిత రహదారిపై పరిశీలించనున్నారు.



సమ్మె కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

ఉపాధి బిల్లులు చెల్లించాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద కూలీల ధర్నా

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి బిల్లులు చెల్లించాలని, పెదపెంకిలో ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని, ఉపాధి బిల్లులు చెల్లించాలని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద కూలీలు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పిస వెంకటస్వామి మాట్లాడుతూ పెదపెంకిలో సుసర్లబందలో 8 గ్రూపులు సుమారు 300 మంది కూలీలు వారం రోజుల క్రితం పనిచేశారని, మస్తరును ఉపాధి కార్యాలయానికి ఇస్తే మస్తరు పేమెంట్ జనరేట్ చేయకుండా రిజెక్ట్ చేయడం మంచిది కాదని అన్నారు. వెంటనే మస్తర్ పేమెంట్ జనరేట్ చేయాలని, అందరికీ పనులు కల్పించాలని అన్నారు. అలాగే ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచేలా తన విధానాలు ఉన్నాయని విమర్శించారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉపాధి కూలీలకు నరకం చూపిస్తున్నారని, రెండు పూటలా పనుల వల్ల వ్యవసాయ పనులు చేసుకోలేక, ఎండవేడికి గురై నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఒక్క పూట ఉపాధి హామీ పనులు ఇస్తామని నాయకులు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. వ్యవసాయ పనులు తగ్గుతున్న నేపథ్యంలో 200 రోజులు ఉపాధి పనులు కల్పించారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువు ధరలకు అనుకూలంగా రూ.600 కూలి ఇవ్వాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు మజ్జిగ, సమ్మర్ అలవెన్స్ అమలు చేయాలని, వృద్ధులకు, వికలాంగులకు, గర్భిణీలకు ఉపాధి హామీ చట్ట ప్రకారం తేలికపాటి పనులు అప్పజెప్పాలని, ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఎండలు తీవ్రత, వడదెబ్బ, పిడుగులు వర్షాలు పడే ప్రమాదం గుర్తించి ఒక్క పూట పనులు కల్పించాలన్నారు. అనంతరం ఎంపిడిఒ నగేష్‌కు, ఎపిఒకు వినతిని అందజేశారు. మీ సమస్య పరిష్కారం చేస్తామని వారు హామీ మేరకు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు భారతి, నాగ, లలిత, స్వప్న, ప్రసాదు, కృష్ణవేణి, మరియమ్మ , శాంతమ్మ , తనియేలో రామయ్య, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు..

నిబంధనలకు పాతర

ఇష్టారాజ్యంగా నిర్మాణం
ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారు. అడిగిన వారు ఎవరూ లేకపోవడంతో కొంతమంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతుంది. ముఖ్యంగా భవన నిర్మాణాల విషయంలో టౌన్ ప్లానింగ్ నిబంధనలను పక్కనపెట్టి ఇష్టా రాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారి బలం డబ్బుతోనే నిబంధనలకు పాతర వేసి నిర్మాణాలు సాగిస్తున్నారు. దీనిపై అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరించడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కోటదుర్గ ఆలయం దగ్గరలో ఒక రాజకీయ నేత లాడ్జి, హోటల్, కళ్యాణ మండపం నిర్మించారు. పార్కింగ్ కూడా అక్కడ స్థలం లేదు. ఇరుకైన స్థలంలోనే నిర్మించి చుట్టుపక్కల వారిని ఇబ్బందులు గురిచేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర పంచాయతీ కాలువను కూడా పూర్తిగా సిమెంట్ పలకతో కప్పి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. వంటగది చుట్టూ గల సమీప ప్రజలు ఆ పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా మరుగుదొడ్లు నీరు కూడా కాలువలోకే విడిచిపెట్టి చుట్టుపక్కల వారికి ఇబ్బందులు గురిచేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇదివరకే ఈ సమస్యలపై స్థానికులు నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ప్రజాశక్తి స్థానిక నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజును వివరణ కోరగా పరిశీలిస్తానని తాను కొత్తగా వచ్చిందని చెప్పారు.



కల్యాణ మండపానికి పార్కింగ్ కోసం కప్పేసిన కాలువ

20న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మే 20న జరుగు దేశ వ్యాప్త కార్మిక, కర్షక సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌వై నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘాలు పెట్టి ఉద్యమించేందుకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను కూడా కేంద్ర ప్రభుత్వం హరిస్తున్నదని, అందులో భాగంగా 48 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మికులకు జీతభత్యాలు పెరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా మార్చి పూర్తిగా నాశనం చేయడం వల్ల సామాన్యులకు నిత్యావసర సరుకులు కూడా అందుబాటులోకి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలన్నింటిపై ప్రజలు తమ నిరసన వ్యక్తం చేసేందుకు మే 20న దేశ వ్యాప్త కార్మిక, కర్షక వర్గాలు ఐక్యంగా ఈ సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నారని, ఈ సమ్మె జయప్రదం చేసేందుకు ప్రతి కార్మికుడు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. అనంతరం సమ్మెకు సంబంధించిన ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చీపురుపల్లి సింహాచలం, నాగవంశం శంకరరావు, బంగారు రవి, మామిడి శివ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డిపిఎం షణ్ముఖరాజు

రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం

ప్రజాశక్తి - కురుపాం

రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం జరగాలని వ్యవసాయ విభాగ డిపిఎం షణ్ముఖరాజు అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద విఎఎ, విఎఎలకు, గ్రామ సంఘ లీడర్లకు, ఎపిసిఎన్ఎఫ్, మండల అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల కలిగిన లాభాల గురించి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు, వ్యవసాయశాఖ ఎడిఎ నిర్మల జ్యోతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - సాలూరురూరల్

శక్తి యాప్ పై అవగాహనా మంగళవారం సాలూరు-దండిగాం రోడ్డు బొడ్డ వలస వద్ద వాహనాలదారులకు సాలూరు రూరల్ పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ శ్రీరాములు మాట్లాడుతూ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ఉండే ప్రతి మహిళ శక్తియాప్‌ను తన ఫోన్లో ఉంచుకోవాలని, దీని ద్వారా వారు ఎటువంటి ఆపదలో ఉన్నా ఆ వ్యక్తి మొబైల్ నుండి ఒక్క మెసేజ్ పెడితే వెంటనే అక్కడకు సంబంధిత పోలీసులు వచ్చి రక్షింపబడతారన్నారు. కావున ఆ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు సీతయ్య, సరస్వతి, రాజహంస పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా గత పది రోజులుగా మండలంలోని పెద్ద బొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 24 మంది టెన్త్ విద్యార్థులకు ఫుడ్ ప్రాసెసింగ్‌లో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేలా విద్యార్థుల వారి పరిసరాలలో దగ్గర్లో ఉన్న బేకరీకి తీసుకువెళ్లి వివిధ రకాలైన ఐటమ్స్ నేర్పించారు. పాఠశాల హెచ్ఎం వి.గౌరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ జిసి డిఒఎన్ మధు కిషోర్ చేతుల మీదుగా శిక్షణ పూర్తి చేసుకున్నట్లుగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విసిలు అప్పలనాయుడు, వాసు, విటిలు అనూష, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


లెనిన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

ఘనంగా లెనిన్ జయంతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చినగోర కాలనీలో మంగళవారం రష్యా విప్లవ నేత కామ్రేడ్ లెనిన్ 155వ జయంతి వేడుకలు సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పి.భాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో రివిజన్ నడ్డి విరిచి విప్లవ పందాలు ప్రజలు ముందు ఉంచిన సిపిఐ ఎంఎల్ పార్టీ 55వ దినోత్సవం సందర్భంగా గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కత్తుల కవిటి సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి వీరఘట్టం

మండలంలోని కత్తులకవిటి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆకస్మిక తనిఖీ చేశారు. సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న వివిధ రకాల సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పరిశీలించారు. పనికి తగ్గ వేతనం రావాలంటే సమయం పాటించి పనుల్లో పాల్గొనాలని వేతనదారులకు సూచించారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడం వల్ల వేగంగా వచ్చి అంతే వేగంగా ఇళ్లకు చేరుకోవాలన్నారు. అనంతరం మస్టర్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు టెక్నికల్ సహాయకులు రమేష్ ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులు ఎంతో ఉపయోగం

ప్రజాశక్తి - కురుపాం

వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వి. రామలక్ష్మి అన్నారు. మంగళవారం పాఠశాలలో ఐటి, ఐటిఇఎస్, అప్పేరిల్ విభాగాల్లో వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా 12 రోజుల పాటు నిర్వహించిన ఇంటర్న్ షిప్‌లో పాల్గొని కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు కూడా చాలా అవసరమని కావున ప్రతి విద్యార్థి చదువుతో పాటు వృత్తి విద్య కోర్సులు కూడా నేర్చుకునేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతి ఇచ్చారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయక కార్యదర్శి జీవ, కార్యవర్గ సభ్యులు సూరయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిఎల్‌పిఒ నాగభూషణరావు అన్నారు. మండలంలోని సూరంపేట, కాశీపేటలో గల ఎస్‌డబ్ల్యూపిసిల కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త వినియోగం, ఉపయోగంపై గ్రామస్తులకు కల్పించాలని కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. వీటి ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కావున కేంద్రాలను వినియోగంలో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పి.మురళీకృష్ణ, శ్రీలక్ష్మి, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు


ఇంటింటి చెత్తను సేకరిణను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ నాగభూషణరావు

విత్తన కంపెనీలతో ఒప్పంద పత్రం తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో ఎక్కువగా మొక్కజొన్న సాగు చేసే రైతులు విత్తన ఉత్పత్తి కోసం కంపెనీతో సరైన ఒప్పందం చేసుకోకుండా వేయడం వల్ల దిగుబడి తగ్గిన తర్వాత వ్యవసాయ శాఖకు ఫిర్యాదు చేస్తున్నారని, అలా కాకుండా విత్తనాలు వేసినప్పుడు ఒప్పంద పత్రాన్ని రాతపూర్వకంగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్ సూచించారు. మండలంలోని పాంచాలి, గురువు నాయుడుపేటలో వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు, కంపెనీకి మధ్య ఒప్పంద పత్రంలో ఉండాల్సిన నియమ నిబంధనలు తెలుపుతూ ఒప్పంద పత్రాన్ని రైతులకు అందజేశారు. ఈ ఒప్పంద పత్రంలో కంపెనీ ఇచ్చిన మినిమం గ్యారంటీ దిగుబడి కంటే తక్కువ వచ్చిన రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం గురించి నియమ నిబంధనలను పొందుపరిచారు. విత్తన ఉత్పత్తి కోసం ప్రైవేటు కంపెనీ విత్తనాలు వేసే రైతులంతా తప్పనిసరిగా ఈ నమూనాలో ఒప్పందం తీసుకుని ఒక కాపీ కంపెనీకి ఇచ్చి ఒక కాపీ రైతు వద్ద ఉంచి మరొక కాపీని విఎఎకు అందజేయాలన్నారు.


నవ ధాన్యాల విత్తన కిట్లను రైతులకు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పంటను నష్టపోయే పరిస్థితిలో ఈ ఒప్పంద పత్రం ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పాంచాలిలో వేసవిలో సాగు చేస్తున్న అపరాల క్షేత్రాలను పరిశీలించారు. చిరు సంచులలో ఉన్న విబిఎన్ 8 మినుము రకాన్ని గురువునాయుడు పేటలో పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తో కలిసి నవధాన్యాలు 13 రకాల విత్తనాలను కలిపి కిట్లను రైతులకు అందించారు. వ్యవసాయశాఖ ఎడి మధుసూదన రావు వేసవిలో అపరాల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ధనుంజయరావు, మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, విఎఎ గణేష్, శ్రీను, ఎన్ఎఫ్ఎఫ్ శారద, ఎంపిటి యశోదమ్మ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

ప్రజా పోరాటాలకు సిద్ధం : వైసిపి

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోందని, ఈ కాలంలో ప్రభుత్వం అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు. రాజకీయ సలహా మండలి సభ్యునిగా ఆయన మంగళవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పిఎసి సమావేశంలో తొలిసారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో ఫోన్ లో మాట్లాడుతూ ప్రతి నెలలో ఒకసారి పిఎసి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఆ నెలలో జిల్లాల్లో జరిగిన ప్రజావ్యతిరేక సంఘటనలు, చర్యలపై స్పందించాలని, సమస్య తీవ్రతను బట్టి పోరాటం చేయాలని సూచించారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం ఇప్పటికే అనేకమంది వైసిపి నాయకులు, కార్యకర్తలను అక్రమ కేసుల్లో ఇరికించి కేసులు నమోదు చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఏడాది సమయం ఇచ్చామని, మిగిలిన నాలుగేళ్లలో ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారని రాజన్నదొర చెప్పారు.

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కొమరాడ మండలంలోని పరశురాంపురానికి చెందిన వావిలపల్లి రామారావుకు సిఎం సహాయ నిధి నుంచి రూ.1,50,029 చెక్కును కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అందించారు. రామారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడని విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సిఎం సహాయ నిధి అందేలా కృషి చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మంగళవారం 'గుడ్ మార్నింగ్ పార్వతీపురం' కార్యక్రమాన్ని పున: ప్రారంభించారు. ఇందులో భాగంగా 9, 10 వార్డుల్లో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ అధికారులు, కౌన్సిలర్లు పర్యటించారు. ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు పలు సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 9,10 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో లేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో అపారిశుధ్యాన్ని నివారించేందుకు చర్యలు చేపడతామన్నారు. మున్సిపాలిటీలో 30ఏళ్ల క్రితం నిర్మించిన కాలువల్లోనే పారిశుధ్య నిర్వహణ జరుగుతుందని, కొత్త కాలువలను నిర్మించి అపారిశుధ్యాన్ని నిర్మూలిస్తామని అన్నారు. అలాగే ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి వార్డులోనూ పర్యటించి దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిశీలించి వాటిని తక్షణమే పరిష్కరించడానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, డిఇ శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.పకీర్‌రాజు, సిబ్బంది, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు), కౌన్సిల్ సభ్యులు కోరాడ నారాయణరావు, బడే గౌరునాయుడు, టి.వెంకటరావు, మంత్రి రవికుమార్, జె.దివ్య, పి.జయంతి, టిడిపి నాయకులు గుంట్రెడ్డి రవికుమార్, డాక్టర్ గరిమెళ్ళ భానుప్రసాద్, కోలా మధుసూదనరావు, జొన్నాడ శ్రీదేవి, సరళ, చిన్న, జి.క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంపై కళాజాతా

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని బగ్గంద్రందొరవలస, సూరంపేటలో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై మంగళవారం కళాజాతా నిర్వహించారు. ఈ కళాజాతా బుర్రకథ రూపంలో ప్రజలకు పరిశుభ్రత - పరిసరాల ఆవశ్యకత స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, మురళీకష్ణ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

మండలంలోని డుమ్మంగి, పి.ఆమిటి, బొద్దిడి గ్రామాల్లో మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించి ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దీనమయ్య అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ ప్రగతిపై ఎంఇఒ మాట్లాడుతూ మండలంలో పాఠశాలలు మూతపడిన విషయాన్ని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లడంతో పునః ప్రారంభానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బాలేసు, కేదారిపురం పంచాయతీల్లో రూ. 2.5 కోట్లతో వసతి గృహాలు మంజూరైనట్లు చెప్పారు. 76 పాఠశాలలకు ప్రహరీలు మంజూరైనట్లు తెలిపారు. మండలంలో 23 మోడల్ ప్రాథమిక పాఠశాలలు మంజూరయ్యాయని చెప్పారు. ఈ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థుల ఉంటారని, ఒక్కొక్క తరగతికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామన్నారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల యూనిఫామ్ కొనుగోలు చేయాలని ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ. 650 చొప్పున పి. ఆమిటి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు వసూలు చేస్తున్నారని ఎంపిటిసి బృందావతి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై పరిశీలిస్తామని ఎటిడబ్ల్యూఒ సురేష్‌కుమార్ తెలిపారు. దుడ్డుఖల్లు పిహెచ్‌సి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణీలను ఎప్పటికప్పుడు గుర్తించి వైద్య సేవలందిస్తున్నామన్నారు. సికిల్ సెలేమియా రోగులకు గుర్తింపు కార్డు మంజూరు చేస్తున్నామన్నారు. సికిల్ సెలేమియా రోగులకు పుట్టే బిడ్డకు ఆ వ్యాధి రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో మలేరియా సోకకుండా స్ప్రేయింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెర వాడకం చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయ భవనాలు, సిమెంట్ బిల్లులు నేటికీ మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు సభ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత పంచాయతీరాజ్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ, జిసిసి, గృహ నిర్మాణం తదితరశాఖలపై సమీక్ష నిర్వహించారు. సర్వసభ్య సమావేశంలో వచ్చిన సమస్యలను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఎంపిపి కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎన్. శేఖర్, లక్ష్మణరావు, ఎంపిడిఒ సాల్మన్‌రాజు, తహశీల్దార్ శేఖర్, పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దీనమయ్య

పెరటి తోటలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - సాలూరు రూరల్

పెరటి తోటల పెంపకం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు కూరగాయలను కొనే ఖర్చులు కూడా తగ్గి అది ఒక ఆదాయంగా మిగులుతుందని నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు తెలిపారు. మంగళవారం స్థానిక నీడ్ కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ ప్రాంతాల గిరిజన మహిళలకు కిచెన్ గార్డెన్స్, సేంద్రియ ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ రైతులు ఎన్నో బాధలు పడుతున్నా వ్యవసాయంపై ఉన్న మక్కువతో పంటలను సక్రమంగా పండించు కొనేందుకు హైబ్రిడ్ విత్తనాలను, రసాయనాలు ఎరువులు ఎక్కువగా వినియోగించి భూములకు జీవవైద్యం కోల్పోయేలా చేసుకోవాల్సి ఉంటుందని దీన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం వైపు మరలినట్టయితే పెట్టుబడులు తగ్గి సారవంతమైన నేలగా తయారై అధిక ఆదాయం వచ్చేలా దోహదపడుతుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతకు, ఆహార భద్రతకు దోహదం చేస్తుందని ఆయన తెలిపారు. ఇంటి ఆవరణలో ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకొని వారు దాని ద్వారా అన్ని రకాల కూరగాయలను ఇంటి దగ్గర దొరికేలా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నీడ్ బృందం మహేష్, శ్రీనివాస్, వసంత, కనక రత్నం పాల్గొన్నారు.

మలేరియా కేసులను సకాలంలో గుర్తించాలి

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా కేసులను సకాలంలో గుర్తించి ప్రాణాలు పోకుండా ఉండేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టి వైద్యమందించాలని జోనల్ మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ కెవిఎస్ ప్రసాదరావు అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస మండలాల సిహెచ్‌సి వైద్యాధికారులకు, వైద్య సిబ్బందికి గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా మలేరియా నివారణ అధికారి వై.మణి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి సిబ్బంది వారి పరిధిలో గల గ్రామాల్లో మలాథిన్ స్ప్రేయింగ్ చేయించి ప్రజలకు మలేరియా నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సలహాదారు జి.రామచంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విడివికెలు ద్వారా జీడి కొనుగోలు

ప్రజాశక్తి - పాచిపెంట

వన్ ధన వికాస కేంద్రాల ద్వారా జీడిపిక్కలకు కొనుగోలు చేస్తామని మన్యం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బి.శ్యామల తెలిపారు. మండలంలోని పింఢ్రింగివలసలో జీడి పిక్కలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో నందేడావలస, పద్మాపురం విడివికెలు జీడి పిక్కలు కొనుగోలు చేస్తామన్నారు. రైతులంతా దళారులను నమ్మకుండా విడివికెలకు అమ్మాలని సూచించారు.

ప్రజలకు పథకాలు అందేలా చూడాలి : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరురూరల్

మున్సిపాల్టీ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే పథకాలు చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమిషనర్ డిటివి కృష్ణారావు తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఉండే ప్రజలకు ప్రభుత్వం చేపట్టే ప్రతి సర్వేను పకడ్బందీగా నిర్వహించి అందులో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా అందించే పథకాలను తెలియజేసి అర్హులైన వారందరికీ అందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్థానిక మున్సిపాల్టీలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వేలు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలో ఏ వార్డులోనూ శానిటేషన్ విషయంలో రాజీ పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బందితో పనిచేసుకోవాలని వెళ్లాలని తెలిపారు. సమావేశంలో కార్యాలయ మేనేజర్ బివి ప్రసాద్ , సచివాలయ గుమస్తా దేవీప్రసాద్, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో 20వ వార్డుకు సంబంధించి 2018లో పాలకొండ క్రిస్టియన్ సంస్థ వారికి స్మశాన వాటికకు కేటాయించిన ఎకరా ఐదు సెంట్లు స్థలం దురాక్రమణకు గురైందని ఫిర్యాదు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై మంగళవారం ఆర్ఐ బాబురావు, సర్వేయర్ శ్రీనివాసరావు పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైందని సబ్బ నానాజీ వేసిన ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ ఆదేశాలతో ఆర్ఐ పరిశీలించారు.


వంతెన వద్ద జెసిబితో తవ్వుతూ ట్రాక్టర్‌తో తరలిస్తున్న ఇసుక

వంతెన వద్ద ఇసుక తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అక్రమ ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతున్న ప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులులదే ఇష్టారాజ్యమన్న ఆరోపణలు వెల్లవెత్తుతున్నాయి. మంగళవారం పట్టపగలు మక్కువ-దుగ్గేరు ప్రధాన రహదారిలో జోడుగెడ్డల వంతెనకు అతి సమీపంలోనే నదిలోని జెసిబితో ఇసుక అక్రమ రవాణా దర్జాగా కొనసాగిస్తున్నారు. ఎటువంటి అనుమతుల్లేకుండా వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయం మంగళవారం మీడియా దృష్టికి వచ్చింది. అప్పటికే మీడియా అక్కడికి వెళ్లడంతో నదిలో జెసిబితో తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీంను వివరణ కోరగా ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని, తవ్వకాలు జరుపుతున్న వాటిని ఆ ప్రాంతం నుంచి పంపించేయడం జరిగిందని, ఇప్పుడే వచ్చామని వారు తెలిపారని, వెంటనే అక్కడ ఉన్న ఖాళీ ట్రాక్టర్లను బయటకు పంపించామని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ నేతల అండదండలతో అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దుర్గాప్రసాద్‌కు రజత పతకం

ప్రజాశక్తి - సీతానగరం

విద్యాశాఖ సమగ్ర శిక్షణా ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలింపిక్ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల క్రీడా పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థి దుర్గాప్రసాద్ 100 మీటర్ల రన్నింగ్ విభాగంలో రజత పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్న లక్ష్మి తెలిపారు. అలాగే ఈనెల 21 నుంచి 23 వరకు నూజివీడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం ఇచ్చిన దుర్గాప్రసాద్‌కు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం మండల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎం.పైడిరాజు, బి.ఆదిలక్ష్మిని మంగళవారం ఆ పాఠశాలలో సన్మానించారు. వర్క్ అడ్జస్ట్మెంట్ బదిలీపై వచ్చిన వీరికి పూర్వపు పాఠశాలకు బదిలీ కావడంతో సన్మానించినట్లు ప్రధానోపాధ్యాయులు వి.మల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, జి.ప్రసాద్, పి.నాగేశ్వరరావు, ఎస్.రామకృష్ణ ఉన్నారు.

సర్పంచ్ కుటుంబానికి అండగా నిలుస్తాం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతానగరం

గుండె పోటుతో ఇటీవల మృతి చెందిన మండలంలోని లచ్చయ్యపేట సర్పంచ్ చింతాడ కృష్ణ (42) కుటుంబానికి పార్టీగానూ, వ్యక్తిగతగానూ అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మంగళవారం ఆయన లచ్చయ్యపేట వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో జడ్పీటీసీ మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, స్థానిక ఎంపిటిసి అక్కపోలు సింహాచలం, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి కురుపాం

మండల కేంద్రంలోని రావాడ జంక్షన్ సమీపాన కోటదుర్గ ఆలయ ప్రాంగణంలో వాయుపుత్ర సేవా సంఘం సభ్యులు బోటు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం కూల్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ పాత్రికేయులు నెల్లి శ్రీనివాసరావు పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి జి.ఢిల్లీశ్వరరావు, వాయుపుత్ర సేవా సంఘ సభ్యులు గుడ్ల సాగర్, బోటు మణికంఠ, పొట్నూరు శబరీష్, జి.పవన్, నెమలిపురి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్

ముగిసిన బూట్ క్యాంపు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ ఎస్. సంధ్యారాణి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన బూట్ క్యాంపు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు మాట్లాడుతూ అటల్ టింకెరింగ్ లాబ్‌లను విద్యార్థులు సద్వినయోగం చేసుకోవాలని, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు మంచి పరిష్కారం చూపే ప్రాజెక్టులను తయారు చేయాలని సూచించారు. ఈ బూట్ క్యాంపు ద్వారా నేర్చుకున్న అంశాలను నిజ జీవితంలో ఉపపయోగపడేలా చూడాలన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సంధ్యారాణి మాట్లాడుతూ అత్యంత ఆధునిక పరికరాలతో కూడిన ఎటిఎల్‌ను సక్రమంగా వినియోగంలోకి తెచ్చుకుని జిల్లాకు పేరు తీసుకొచ్చే ప్రాజెక్టులు చేయాలని కోరారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుండి విచ్చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే వినియోగదారుల వేదిక

ప్రజాశక్తి - కురుపాం

విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్తు వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానికుల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై చర్చించారు. జిల్లాలో వినియోగదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వచ్చిన ఫిర్యాదులను నెల రోజుల వ్యవధిలో పరిష్కారానికి కృషి చేస్తామని, వినియోగదారుల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నప్పుడు వారికి నాణ్యమైన సేవలందించాల్సిన బాధ్యత సంస్థపై ఉందని అన్నారు. కార్యక్రమంలో సాంకేతిక, ఆర్థిక, స్వతంత్ర సభ్యులు, ఇఇ గోపాలకృష్ణ, డిఇ రాజేంద్రప్రసాద్, ఎఇ కోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాల నుంచి ఆదాయానికి చర్యలు : డిపిఒ

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామ పంచాయతీల్లో నిర్మాణం చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అన్నారు. మండలంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీ ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను నిర్మాణం చేపట్టడం వల్ల గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్తను నిర్మాణం చేపట్టిన చెత్త నుండి సంపద తయా రీ కేంద్రాల్లో వేయాల్సి ఉందని అన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి శశి భూషణ్ తదితరులు పాల్గొ న్నారు.

జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగు పరచాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ ఒబిసి జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు, నియోజకవర్గం చైర్మన్ సిరిసుపల్లి సాయి శ్రీనివాస్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు కోరారు. కొత్తగా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన జి.నాగ శివ జ్యోతిని వీరు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించేలా కృషి చేయాలన్నారు. వైద్యుల హాజరుపై ఉన్న ఆరోపణలు ఇకపై లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గిరిజన, నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు అధిక శాతం ఉండడం, వారంతా జిల్లా ఆసుపత్రి వైద్య సేవలపై ఆధారపడుతున్నారని అన్నారు. కావున జిల్లా ఆస్పత్రిలో ప్రజలకు ఉత్తమ వైద్య సేవలందేలా చూడాలన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలన్నారు. జిల్లా ఆసుపత్రి నుంచి విజయనగరం, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు రిఫరల్ కేసులు తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిన్నపిల్లలకు, రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు.